బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 31 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ఆర్థిక బిల్లు, బ్యాంకింగ్ రెగ్యులేషన్స్, వక్ఫ్ సవరణ బిల్లుతో సహా మొత్తం 16 బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. రెండు విడతలు జరిగే ఈ సమావేశాలు తొలుత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. తొలిరోజు ఉభయ సభల ఉమ్మడి సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. అదే 2024-25కు సంబంధించిన ఆర్థిక సర్వేను ప్రవేశ పెడతారు. ఫిబ్రవరి 1న 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి.



Proposed Design

# ఉస్మానియాకు కొత్త భవనం

- ఆస్పత్రి భవనానికి నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 2 వేల పడకల సామర్థ్యంతో 26 ఎకరాల విస్తీర్ణంలో..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్త శకం ప్రారంభం కానుంది. వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని ప్రజా ప్రభుత్వం సంకల్పించగా, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. కొత్త ఆసుపత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనాలు కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని, ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా.. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నస్టిక్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు. అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆసుపత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్ల వంటి సమస్త సౌకర్యాలతో అత్యాధునికంగా నిర్మించనున్నారు.

# ప్రొఫెసర్లకు ఉద్యోగ విరమణ వయస్సు 65కు పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఉన్నత విద్యా శాఖ పరిధిలో 12 విశ్వవిద్యాలయాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుండి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలో పన్నెండు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాటిలో 2,817 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 757 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతి నెలా ఉస్మానియా, జేఎన్‌టీయుహెచ్, కాకతీయ విశ్వవిద్యాలయాలలో ఇద్దరు ముగ్గురు చొప్పున ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందుతున్నారు.

# విద్యుత్ సామర్థ్యం పెంపులో మరో ముందడుగు

**హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఆన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలను ఆహ్వానించింది. ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసిన రాష్ట్ర విద్యుత్‌శాఖ అధికారుల బృందం 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్‌సింగ్ సఖుతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 400, 120 మెగావాట్ల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా అధికారికంగా ఒక లేఖను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్ట్ ముసాయిదాను పంపిస్తే ఒప్పందంపై తగిన పరిశీలన చేసిన త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భటి ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్‌ను మన రాష్ట్రానికి సరఫరా చేస్తారు. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర అవసరాలు, భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్, సరఫరా సామర్థ్యం పెంచేందుకు మరింత ఉపయోగపడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వం ప్రతిపాదించిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ భేటిలో విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అబద్ధాలతో సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకర మైన రోజులు వచ్చాయని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన వల్ల తెలంగాణ వందేండ్లు వెనక్కివెళ్లిన పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్ధాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువ కాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. గురవారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె.. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేశారు. చేతిలో ఎర్రబుక్కు పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, సచివాలయం లో ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్దిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారని వివరించారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాటమారుస్తున్నా రని, కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చే ఆలోచనతో ఉందని అను మానం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ అర్హులైన అందరికీ పారదర్శకంగా పథకాలను అందించారని, కేసీఆర్ హయాంలో నేరుగా లబ్దిదారులకే కోట్లాది రూపాయలు వెళ్లాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చేశామని చెప్పడమే తప్పా ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని, కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అన్నది తెలియని దుస్థితి ఏర్పడిందని, చెరువులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయని చేతగాని ప్రభుత్వం అని అన్నారు.

# కౌన్సిల్ సమావేశం రసాభాస

- పలుమార్లు సభకు అంతరాయం
- చర్చ లేకుండానే బల్దియా వార్షిక బడ్జెట్ రూ. 8,440 కోట్లకు ఆమోదం
- పజా సమస్యలు చర్చించిన తర్వాతే బడ్జెట్లో పెట్టాలన్న విపక్ష కార్పొరేటర్లు
- మేయర్‌పైకి బడ్జెట్ ప్రతులు విసిరిన విపక్షాలు
- బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్ట్.






బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్పొరేషన్ 10వ సాధారణ సమావేశం ˆసాభాసగా మారింది. పలుమార్లు సభలో గందర గోళం నెలకొంది. విపక్ష సభ్యులు రచ్చ రచ్చ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025 - 2026) కోసం రూపొందించిన బడ్జెట్ కు ఆమోదం తెలపడం కోసం కౌన్సిల్ సమావేశమైంది. ఉదయం 10:30 గంటలకు మొదలైన సభలో దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అంతకు ముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ అంచనా బడ్జెట్ రూ.8,440 కోట్లకు ప్రవేశపెట్టారు. అయితే ఎలాంటి చర్చలేకుండానే బల్దియా వార్షిక బడ్జెట్ రూ.8,440కోట్లకు ఆమోదించారు. ఎలాంటి చర్చ లేకుండానే ఎలా ఆమోదిస్తారంటూ సభ్యులు మేయర్ తీరుపై మండిపడ్డారు. బడ్జెట్‌పై కాకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని బీఆర్ఎస్ కార్పొరేట్లు మొదటి నుంచి పట్టుబట్టారు. అయితే ముందుగా బడ్జెట్ ఆమోదం పూర్తయిన తర్వాత కౌన్సిల్ సమావేశం నిర్వహిద్దామని మేయర్ చెప్పడంతో కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ హామీలిచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై నిలదీశారు. కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు నినాదాలు చేశారు. ఇదిలావుండగా బీజేపీ కార్పొరేటర్లు భిక్షటన చేస్తూ తమ నిరసన తెలిపారు.

ఇరువర్గాలు ఆరోపణలు.. ప్రత్యారోపణలు చేసుకోవడంతో సభలో పలుమార్లు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక దశలో మేయర్ పోడియం వైపుకు విపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటరు ముకుమ్మడిగా దూసుకువచ్చారు. బడ్జెట్ ప్రతులను చించి మేయర్ పై విసిరివేసే ప్రయత్నం చేశారు. దీనిని కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకునే ప యత్నం చేయడంతో సభ జరుగుతున్నంత సేపు గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్యతోపులాట చోటుచేకుంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రదర్శించిన ఫ్లకార్డులను కాంగ్రెస్ సభ్యులు చించివేశారు. మార్షల్స్‌ను పిలిపించిన మేయర్ బీఆర్ఎస్ నలుగురు కార్పొరేటర్లను బయటకు పంపించారు. అయితే వారిని కౌన్సిల్‌లోకి అనుమతించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు పట్టుబట్టారు. దాంతో తిరిగి కౌన్సిల్‌లో గందరగోల పరిస్థితి నెలకొంది. అడుగడుగునా మేయర్ ప్రసంగాన్ని బీఆర్ఎస్ కార్పొరేట్లు అడ్డుపడుతుండడంతో బీ.ఆర్.ఎస్ సభ్యులను మేయర్ జీహెచ్ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం మార్షల్స్ తో బీ.ఆర్.ఎస్ సభ్యులను బయటకు తీసుకెళ్లారు. సభనుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రభుత్వానికి, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. దాంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని మహంకాళీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత సభలో ఉన ఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీ సభ్యులతో కౌన్సిల్ సమావేశాన్ని సాయంత్రం వరకు కొనసాగించారు.

**సమన్వయంతో పనిచేయాలి : మేయర్ విజయలక్ష్మి**

నగర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మేయర్ మాట్లాడారు. జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. ముఖ్యంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దియా అభివద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కోరారు.

నగరంలోని పార్కులు, క్రీడా మైదానాలలో అవసరమైన ఫెసిలిటీస్ కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. క్రీడా మైదానాలలో అవసరమైన ఆయా వసతులను సమకూర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఆయా వసతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. స్ట్రీట్ లైట్లకు సంబంధించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, లైటింగ్ కు సంబంధించిన కాంట్రాక్టర్లను నియమించామని, త్వరితగతిన పూర్తి చేస్తారని తెలిపారు.

**జీహెచ్ఎంసీ ఆఫీస్ ముందు బీఆర్ఎస్ ధర్నా**

మేయర్ బీఆర్ఎస్ సభ్యు లను సభ నుంచి బయటకు పంపడంతో హెచ్ఎంసీ ఆఫీస్ ముందుబీఆర్ఎస్ ధర్నారు దిగింది అనంతరం బీఆర్ఎస్ కార్పొరేటరు మాట్లాడుతూ, ప్రజల పక్షాన మాట్లాడితేసభనుంచి బయటకు పంపుతారా..? ఇది ఎం. తవరకు కరెక్ట్ అని నిలదీశారు. రాష్ట్రంలో ఇష్టమొచ్చినట్లు పాలన చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఎలాంటి చర్చ జరగకుం దానే బడ్జెట్ ఆమోదించడం ప్రజాస్వామిక విధానం కాదని, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అన్నారు.

# మహాకుంభమేళాలో అగ్నిప్రమాదం

బలగం టీవీ, ప్రయాగ్‌రాజ్



మహా కుంభామేళాలో మరో అపశృతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట జరిగిన మరుసటి రోజే భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమమైన మహాకుంభమేళాలో అగ్ని ప్రమాదం జరగడం ఇది రెండోసారి. జనవరి 19న తొలి అగ్నిప్రమాదం జరిగింది. తాజాగా, గురువారం సెక్టార్-22 ప్రాంతంలో మంటలు చెలరేగి ఇప్పటికే అనేక టెంట్లు దగ్ధమయ్యాయి. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగిన స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తోంది. సీనియర్ అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే, వరుస ప్రమాదాల నేపథ్యంలో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

# త్వరలో మద్యం ధరలు పెంపు..!



బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్టు తెలిసింది. ముందుగా బీర్లు, ఆ తర్వాత లిక్కర్ ధరలను పెంచనున్నట్టు సమాచారం. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా ఎక్సైజ్ శాఖ ధరల పెంపు ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసింది. రాష్ట్రంలో మద్యం ధరలు పెంచొద్దని ప్రభుత్వం ముందుగా నిర్ణయం తీసుకున్నప్పటికీ, పక్క రాష్ట్రాల్లో ధరలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అంతేకాకుండా ఇటీవల యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరాను ఆపేసింది. ధరల పెంపునకు నిర్ణయం తీసుకోవడం లేదంటూ లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బీర్లతో పాటుగా లిక్కర్ ధరల్లో మార్పులు చేయాలనే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. లిక్కర్ ధరలను సగటున 20 నుంచి 25 శాతం మేర పెంచేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం

మద్యం ధరల పెంపుపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ నివేదిక ప్రకారం బీర్లపై 15 శాతం, బ్రాండెడ్ లిక్కర్‌పై క్వార్టర్‌కు రూ.10 నుంచి 80 వరకు పెంచనున్నట్టు సమాచారం. ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. సచివాలయంలో గత నాలుగైదు రోజులుగా అధికారులు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ప్రీమియం బ్రాండ్ లిక్కర్‌తో పాటు బీర్లను పెంచనున్నట్టు తెలిసింది. అయితే చీప్ లిక్కర్ రేట్లను మాత్రం తక్కువ శాతం పెంచాలని ఎక్సైజ్ శాఖ నివేదిక ఇచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీల రూపంలో రూ.36 వేల కోట్ల ఆదాయం వస్తుందని రేవంత్ సర్కార్ అంచనా వేసింది. ఏప్రిల్ - సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల్లో ఎక్సైజ్ శాఖకు ఎక్సైజ్ డ్యూటీ ద్వారా రూ.9,493 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.8,040 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. అంటే తొలి ఆరు నెలల్లో రూ.17,533 కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. అయితే, ఆ తర్వాత పండుగలు, డిసెంబర్ నెలలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో ఆదాయం పెరిగింది. ప్రస్తుతం మద్యంపై కొంత ఆదాయం తగ్గిన నేపథ్యంలో ధరలు పెంచి ఆదాయాన్ని సమకూర్చు కోవాలని సర్కార్ భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లు, పబ్‌ల ద్వారా ద్వారా రోజుకు సరాసరిగా రూ.90 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. నెలకు సగటున రూ. 2,700 కోట్ల నుంచి రూ. 3,000 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడిస్తున్నారు. లిక్కర్ రేట్లు పెంచితే ఆ ఆదాయానికి తోడు.. ప్రతి నెలా దాదాపు రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు అదనంగా ఆదాయం వస్తుందని అంచనా.

# కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్ఠానం వద్దకు పంపించామని తెలిపారు.

# బండరాళ్లు పడి ఇద్దరు ఉపాధి కూలీలు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు మీద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల వ్యాప్తంగా గురువారం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ శివారులోని గుట్ట వద్ద కొన్ని వారాలుగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. గురువారం యధావిధిగా పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మట్టి దిబ్బలు, రాళ్లు మీద పడి అన్నాజీ మమత(35), కందారపు సరోజన (50) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఇంద్రాల స్వరూప కాళ్లు విరగ్గా, ఈసంపెల్లి కనుకవ్వ, ఇంద్రాల రేణుకకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని అన్నారు. గత కొంతకాలంగా మట్టిదిబ్బలు పడుతున్నాయని, అయినా అధికారులు అక్కడే పని చేయిస్తున్నారని తెలిపారు. ప్రమాదకర ప్రదేశంలో పనిచేస్తున్నా అధికారులు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవని, చివరికి ప్రాణాలు పోయిన తర్వాత హుటాహుటిన అక్కడికి చేరుకున్నారని ఆగ్రహించారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించాలని, వారి కుటుంబాల్లో ఎవరికో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

# తపన్ బోస్ కన్నుమూత

బలగం టీవీ, హైదరాబాద్



ప్రముఖ డాక్యుమెంటరీ నిర్మాత, సామాజిక కార్యకర్త తపన్ బోస్(78) గురువారం తన ఇంట్లో కన్నుమూశారు. 1970 దశకం నుంచే అంటే ఎమర్జెన్సీ కాలం నుంచే ఆయన సామాజిక కార్యకర్తగా ఉన్నారు. ఆ యన పంజాబ్, జమ్మూకశ్మీర్ మానవ హక్కుల ఉల్లంఘనలపై నిర్భయంగా తన వాదన వినిపించారు. ఆయన యాన్ ఇండియన్ స్టోరీ ఆన్ భాగల్పూర్ బైండింగ్స్(1981), భోపాల్: బియాండ్ జెనోసైడ్(1986), ఝార్ఖండ్ (1993), ది ఎక్స్‌పెండేబుల్ పీపుల్(2016) వంటి గొప్ప డాక్యుమెంటరీలు రూపొందించారు. దేశభక్తి జాతీయవాదం(జింగోయిస్టిక్ నేషనలిజం), సైనికీకరణ(మిలిటరైజేషన్)లను వ్యతిరేకించే సముదాయాలకు ఆయన మిత్రుడు. ఆయన స్నేహం బలూచిస్థాన్, బర్మ, కశ్మీర్, నాగా, శ్రీలంకలోని తమిళ ఉద్య మం వరకు విస్తరించింది. అప్రజాస్వామిక శక్తులతో పోరాడేందుకు డాక్యుమెంటరీ ఫిల్మ్‌లనే మాధ్యమంగా ఎంచుకున్నారు. తపన్ బోస్ అంత్యక్రియలు శుక్రవారం లోది రోడ్ దహనవాటికలో జరుగనున్నాయి. ఆయనకు భార్య రీటా మన్‌చంద, కూతురు దేవానీ సైనీ ఉన్నారు.

# అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం గురువారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ముఖ్యమైన అంశాలను చర్చించేందుకు సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభ సజావుగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# విమానం, హెలికాప్టర్ ఢీకొని 67 మంది మృతి




బలగం టీవి, హైదరాబాద్

అమెరికా రాజధాని వాషింగ్టన్ సమీపంలోని రొనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్ పోర్టులో ప్యాసింజర్ విమానం, మిలిటరీ హెలికాప్టర్ ఢీకొన్నాయి. విమానంలో ప్రయాణిస్తున్న 64 మంది, హెలికాప్టర్‌లో ఉన్న ముగ్గురు మొత్తం 67 మంది ప్రాణాలు కోల్పోయారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతి పెద్దప్రమాదమని అధికారులు చెబుతున్నారు. కాన్సాస్ లోని విచిటా నుంచి బయలుదేరిన పీఎస్ఏ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ సిజెఆర్ 700 విమానం ల్యాండింగ్ అవుతుండగా, సీకోర్సీ హెచ్60 హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న పొటోమాక్ నదిలో పడిపోయింది. ఇంతవరకు ఈ నది లోంచి 28 మృతదేహాలను వెలికి తీశారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది.

అమెరికన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన ఈ విమానాన్ని స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ప్రమాదానికి గురైన బ్లాక్ హాక్ హెలికాప్టర్‌ను శిక్షణకు వాడుతున్నట్టు అమెరికా సైనికవర్గాలు ధ్రువీకరించాయి. విమానం ఢీకొన్న సమయంలో కూడా అందులో శిక్షణ ఇస్తున్నట్టు తేలింది. ఇది 12 వ ఏవియేషన్ బెటాలియన్‌కు చెందినదిగా తేలింది. హెలికాప్టర్ ఢీకొనడంతో అమెరికన్ ఈగల్ ఫైట్ 5342 రెండు ముక్కలుగా విరిగిపోయి కూలిపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మరోవైపు హెలికాప్టర్ తలకిందులుగా పడినట్టు పేర్కొన్నారు. ఈ బ్లాక్‌హాక్ వర్జీనియాలో పోర్ట్ బెల్వోయి స్థావరం నుంచి సైనికులతో వస్తున్నట్టు గుర్తించారు.సంఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు.

ఇక హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణశాఖ అధికారులు తెలిపారు. వీరి గురించి గాలింపు చర్యలు ప్రారంభించారు. నదిపై నుంచి విమానం, హెలికాప్టర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు ఎన్‌టీఎస్ నేతృత్వంలో ఎఫ్ఏఏ దర్యాప్తు చేస్తోంది. ప్రస్తుతం 300 మంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అతిశీతల వాతావరణం, తీవ్రమైన ఈదురు గాలుల వల్ల సహాయకచర్యలకు అంతరాయం కలుగుతోందని వాషింగ్టన్ ఫైర్ అండ్ ఇఎంఎస్ చీఫ్ జాన్ ఏ డోనెల్లీ గురువారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పొటోమాక్ నది దాదాపు 8 అడుగుల లోతులో ఉంటుంది. ఢీకొన్న తరువాత విమానం అందులో కుప్ప కూలింది. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర లోనే హెలికాప్టర్ శకలాలను గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు.

### ప్రమాదంపై ట్రంప్ ఆరా

“ విమానాశ్రయానికి వెళ్లే దారిలో విమానం సరైన దిశలో ఉంది. కానీ హెలికాప్టర్ చాలా సేపు నేరుగా విమానం వైపు వెళ్లింది. ఆకాశం నిర్మలంగా ఉంది. విమానం లైట్లన్నీ వెలుగుతున్నాయి. కానీ హెలికాప్టర్ కిందకో, మీదికో , పక్కకో ఎందుకు వెళ్లలేదు. విమానాన్ని చూశారా అని అడిగే బదులు ఏం చేయాలో కంట్రోల్ రూమ్ లోని సిబ్బంది ఎందుకు చెప్పలేదు. ఇది పూర్తిగా నివారించదగ్గ ప్రమాదం. ఇలా జరగడం ఏమాత్రం సరిగా లేదు. ” అని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విమానం ల్యాండింగ్‌కు ఏటీసీ క్లియరెన్స్ ఇవ్వగా, సరిగ్గా అదే సమయానికి ఓ మిలిటరీ హెలికాప్టర్ ఆ మార్గం లోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ హెలికాప్టర్‌కు సమాచారం ఇచ్చారు. “ మీ ముందు విమానం వస్తోంది కన్పి స్తుందా ' ' అని అడిగారు. కొన్ని క్షణాల్లోనే మరో రేడియో కాల్‌ను పంపిం చారు. ఆ తర్వాత కేవలం 30 సెకన్ల లోనే ఆ రెండూ ఢీకొన్నట్టు శబ్దం వినిపించింది. ఆ సమయంలో రెండింటిలో కలిపి 67 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో గాలింపు చర్యలను పర్యవేక్షిస్తానని స్వయంగా ట్రంప్ వెల్లడించారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు రీగన్ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. అక్కడికి రావలసిన విమానాలను మరో చోటికి మళ్లించారు. అమెరికా లోనే అత్యంత రద్దీ రన్‌వే రీగన్ ఎయిర్‌పోర్టు లోనే ఉంది. దీనిపై నుంచి నిత్యం సగటున 800 విమానాలు టేకాఫ్ అవుతాయని ఎన్‌బీసీ న్యూస్ పేర్కొంది.

# ఇన్‌ఫ్లూయెన్సర్లకు సజ్జనార్ హెచ్చరిక



బలగం టీవి, హైదరాబాద్

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లపై టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, యువతను ఆన్‌లైన్ పందాలు, జూదం వైపు పురిగొల్పితే వినియోగదారుల రక్షణ చట్టం- 2019, ఐటీ చట్టం- 2000 సెక్షన్ 79 ప్రకారం నేరమని హెచ్చరించిందని ఆయన పేర్కొన్నారు. అయినా కొంత మంది ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ స్వలాభం కోసం ఇష్టారీతిన ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నారని, గుర్తుపెట్టుకోండి మీరంతా శిక్షార్హులే అని ఆయన అన్నారు. అంతేకాకుండా.. మాకు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.. మేం ఏం చేసిన నడుస్తుందని అనుకుంటే పొరపాటే అని, సమాజ శ్రేమస్సును దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లను ప్రమోట్ చేయడం ఆపండని హితవు పలికారు. స్వార్థానికి పోయి అమాయకుల ప్రాణాలకు బాధ్యులు కాకండని ఆయన తెలిపారు.

# ఇంటర్ హాల్ టెకట్ల జారీలో సాంకేతిక సమస్య

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ ఇంటర్ హాల్‌టికెట్ల జారీలో సాంకేతిక సమస్యలు తెలెత్తాయి. సీజీజీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో హాల్‌టికెట్ లేకున్నా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని ఇంటర్ బోర్డు ప్రకటించింది. హాల్‌టికెట్ రానివారి జాబితా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఇంటర్ బోర్డు ఆదేశించింది. ఫీజు చెల్లించిన వారు, చెల్లించని వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని బోర్డు తెలిపింది.

# గాంధీజీకి నివాళులర్పించిన కేసీఆర్

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో.. స్వరాష్ట్ర పదేండ్ల ప్రగతిలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా కేసీఆర్ నివాళి అర్పించారు. వారు దేశానికందించిన సేవలను, చేసిన త్యాగాలను కేసీఆర్ స్మరించు కున్నారు. సహనంతో శాంతియుత పంథా ద్వారా మాత్రమే గమ్యాన్ని చేరుకోగలం. ప్రపంచానికే గాంధీజీ కార్యాచరణ అనుసరణీయమన్నారు. పరాయి పాలన నుంచి భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం గాంధీజీ అనుసరించిన శాంతియుత పోరాట పంథా, ప్రపంచ ప్రజాస్వామిక ఉద్యమాలకు, స్వయంపాలనకు మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. పీడిత వర్గాలు శాంతియుత మార్గంలో ఐక్యతను సాధించి పోరాడినప్పుడే తమ గమ్యాన్ని చేరుకోగలరనే సందేశాన్ని గాంధీజీ ప్రజాస్వామిక ఉద్యమ కార్యాచరణ మనకందిస్తుందని తెలిపారు. అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ తెలిపారు. సబ్బండ వర్గాలు, సకలజనులు అభివృద్ధి చెంది, గ్రామ స్వరాజ్యం ఫరిఢవిల్లేలా పదేండ్ల బీఆర్ఎస్ పాలన సాధించిన ప్రగతి వెనుక గాంధీజీ ఆదర్శాలున్నాయన్నారు. సహనంతో కూడిన దార్శనికతను ప్రదర్శించడం ద్వారానే సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరింత ప్రగతి సాధ్యమవుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. తద్వారా మాత్రమే మనం గాంధీజీకి ఘన నివాళి అర్పించిన వారమవుతామని స్పష్టం చేశారు.



# నాగోబ జాతరకు పోటెత్తిన జనం

బలగం టీవి, హైదరాబాద్


ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరుగుతున్న నాగోబ జాతరకు గురువారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి గిరిజనులు నాగోబాను దర్శించుకున్నారు. మిశ్రమం వంశానికి చెందిన గిరిజనులు పెద్దదేవునికీ, మహిళలు బాన్ దేవత పూజలు నిర్వహించారు. జాతర ప్రారంభమైన రెండో రోజు భారీగా భక్తులు తరలిరావడంతో అధికారులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం జరిగే గిరిజన దర్బార్ కు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.



# స్పీకర్ బిర్లాకు వక్ఫ్ సవరణ బిల్లు నివేదిక సమర్పణ

బలగం టీవి, న్యూఢిల్లీ

వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ వక్ఫ్ సవరణలపై తుది నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు గురువారం సమర్పించింది. ప్యానెల్ ఛైర్‌పర్సన్ జగదాంబికా పాల్ పార్లమెంట్ కార్యాలయంలో బిర్లాను కలుసుకుని ఈ నివేదికను అందజేశారు. బుధవారం నాడు ఈ సవరణ బిల్లుపై విపక్షాలు అసమ్మతి తెలిపాయి. 1511 మెజార్టీ ఓటుపై కమిటీ ఈ ముసాయిదా బిల్లును ఆమోదించింది. ఈ బిల్లుకు బీజేపీ సభ్యులు మద్దతు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం పేర్కొంది. మరోవైపు ముస్లింలకు రాజ్యాంగ పరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని , వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్షసభ్యులు ఆరోపించారు.



# బాలుడికి హెచ్‌ఎంపీవీ


- **గుజరాత్‌లో 8కి చేరిన కేసుల సంఖ్య**

బలగం టీవి, న్యూఢిల్లీ

నాలుగేళ్ల బాలుడికి హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ సోకింది. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. గుజరాత్‌లో ఈ కేసుల సంఖ్య 8కి చేరినట్లు వెల్లడించారు. జనవరి 28న అహ్మదాబాద్‌లోని గోటా ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలుడు జ్వరం, దగ్గుతో బాధప డ్డాడు. ఎస్‌జీవీపీ ఆసుపత్రిలో అడ్మిట్ కావడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. దీంతో ఆ బాలుడికి హెచ్‌ఎంపీవీ సోకిందని అదే రోజున నిర్ధారించినట్లు అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారి తెలిపారు. ఆ బాలుడు ఇటీవల విదేశాల్లో ప్రయాణించినట్లు చెప్పారు. కాగా, గుజరాత్‌లో ఇప్పటి వరకు 8 హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో ఏడు, సబర్కాంత జిల్లాలో ఒక కేసు వెలుగుచూశాయి. అహ్మదాబాద్‌లోని ఆసుపత్రుల్లో చేరిన ఆరుగురు రోగులను పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# నిధులు అడిగితే అరెస్టు చేస్తారా..?

- **మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు**



బలగం టీవి, హైదరాబాద్

జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా? అని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. రాష్ట్రానికి గుండె కాయ లాంటి హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మీ వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా? అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ మీద ఎలాంటి చర్చ లేకుండానే అమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికం. మీ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనం. ప్రజల తరుపున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## గాంధీ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్దాం

- ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

**బలగం టీవీ , వేములవాడ**

బ్రిటిష్ పాలనలో వివక్షకు,వారి అరాచక పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ ఎన్నో పోరాటాలు చేశారని,అనేక మంది స్వాతంత్ర సమరయోధులను ఏకం చేసి స్వతంత్ర పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం చిర్లవంచ గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని,గతంలో పెండింగ్లో ఉన్న 3000 పై చీలుకు దరఖాస్తులకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలు విడివిగా ఉత్తరాలు రాస్తే,మళ్లీ ఎందుకు రాయడం అని దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని,ప్రజలు గ్రామపంచాయతీలో కూర్చొని నాకు వారి సమస్యలను పరిష్కరించవలసిందిగా ఉత్తరాలు రాస్తే దానిని కూడా కొందరు తప్పుగా చిత్రీకరించారని అన్నారు.

గ్రామ ప్రజలు ఊరి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీలో కూర్చుంటే దాని పై కూడా విమర్శ చేస్తున్నారని,ముంపు గ్రామాల ప్రజలను పది సంవత్సరాలుగా పట్టించుకోని వారు, వారి పత్రికల్లో మమ్మల్ని విమర్శించే కార్యక్రమం చేపట్టారని అన్నారు.ఇటీవల అర్బన్ మండల పరిధిలో పలు సిసి రోడ్ల నిర్మాణానికి ఇంచుమించు రెండు కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందని,చీర్లవంచ గ్రామంలో మంచినీటి ఇబ్బంది ఉంటే బోర్లు వేపియడం, తెట్టకుంట గ్రామంలో సి సి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు.దశాబ్ద కాలంగా వెనుకబడిన వేములవాడను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నానని అన్నారు. మారుపాక కామన్ నుండి సుద్దాల పల్లీమక్త మర్తన్నపేట రోడ్డు గత పాలకులు పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వంలో 1 కోటి 50 లక్షలతో రోడ్డు నిర్మాణం,మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి 10 సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తే గత పాలకులు చేయకపోవడంతో ఏడు కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. వేములవాడ పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని,ముంపు గ్రామాల ప్రజలకు 238 కోట్లతో 4696 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. రెండవ దశలో మిగిలిపోయిన వారికి కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# వేసవిలో తాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

- ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహణ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలను జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ త్రాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా త్రాగు నీటి సరఫరా లో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, ఇబ్బందులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాకు సంబంధించి ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నివేదిక ముందుగానే అందించాలని అన్నారు .

సిరిసిల్ల జిల్లాకు సంబంధించి మిడ్ మానేర్, అప్పర్ మానేర్ నుంచి త్రాగు నీరు వేములవాడ లోని గుర్రంవాని పల్లి 120 ఎం.ఎల్.డి, గంభీరావు పేట మండలంలోని కోలమద్ది 7 ఎం.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ల నుంచి 300 ఆవాసాలు ( 271 రూరల్, 29 అర్బన్) నీటి సరఫరా జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం 11 ఆవాసాలలో నీటి లీకేజిలు, రైల్వే, రోడ్డు భవనాల శాఖ వల్ల మరమ్మత్తు గురయ్యాయని , వీటి పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి త్రాగు నీటి సరఫరా సమస్యలను గుర్తించాలని అన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి ఆవాసాలకు బల్క్ వాటర్ సప్లై సక్రమంగా జరుగుతుందా, ఇంట్రా పైప్ లైన్ల ద్వారా ప్రతి



ఇంటికి త్రాగునీరు అందుతుందో లేదో స్పెషల్ డ్రైవ్ లో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కోసం ప్రతి మండలంలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఇంజనీరింగ్ అధికారులు ప్రతి ఆవాసాని కి వెళ్లి త్రాగునీటి సరఫరాను పరిశీలించాలని కోరారు.

వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు వచ్చే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్థానికంగా ఇతర నేటి సరఫరా సోర్స్ లను గుర్తించాలని అన్నారు. ప్రతి మండలంలో త్రాగునీటి సరఫరా ఏ ఆవాసాలకు ఇబ్బంది అవుతుంది వివరాలు తెలుసుకొని, అక్కడ వేరే మార్గాల ద్వారా త్రాగునీటి సరఫరాకు అవకాశం ఉందో పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు . జిల్లాలో త్రాగునీటి సరఫరా లీకేజీ లను ఎప్పటికప్పుడు అరి కట్టేలా చర్యలు తీసుకోవాలని, నీటి వృధాను నివారించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-4007 ఏర్పాటు చేశారని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ఇన్చార్జి డిపిఓ శేషాద్రి మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి మిషన్ భగీరథ గ్రిడ్ డి ఈ రాము ,ఎంపీడీవోలు, ఏ.ఈలు ఎంపీఓలు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి..



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

జీజీహెచ్ లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారుపిడియాట్రిక్ వార్డు, పోస్టు ఆపరేటివ్ వార్డు, ఓటీ వెనుక వైపున గల లీకేజిలు, ఎస్.ఎన్.సీ.యూలో సీలింగ్ మరమ్మతులు, సూపరింటెండెంట్ ఛాంబర్ ప్రక్కన గల రూమ్లలో పైకప్పు మరమ్మత్తు, ఓ.పి గేట్ - 1 ముందు నుండి ఎమర్జెన్సీ వార్డు వరకు గల ఖాళీస్థలంను ద్విచక్ర వాహనాల పార్కింగ్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్, అత్యవసర పేషెంట్లను మెరుగైన చికిత్సల కొరకు జీజీహెచ్ నుంచి ఉస్మానియా / గాంధీ ఆసుపత్రికి తరలింపు కొరకు అడ్వాన్స్డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాటు అంశాలపై చర్చించారు. క్లీనింగ్, ఇతర పనులు సంబంధిత శాఖల అధికారులతో చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య అధికారి రజిత, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య సమర యోధులకు ఘన నివాళి

- మౌనం పాటించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

జాతిపిత, స్వాతంత్ర్య సమర యోధుడు మహాత్మ గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. మహాత్మ గాంధీజీ వర్ధంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం స్వాతంత్ర్య సమర యోధులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా శాఖల ఉన్నతాధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళి అర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం వారు పోరాడిన తీరు, సేవలను కొనియాడారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బెటాలియన్‌ను సందర్శించిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఐజీపీ రమేష్

**బలగం టీవీ , సిరిసిల్ల**

సార్ధపూర్ లో ని 17వ బెటాలియన్ లో నిర్మాణంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ ,బెల్ ఆఫ్ ఆర్మ్స్,కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలసి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఐజిపి రమేష్ పరిశీలించినరు.అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యి నిర్మాణములో వున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఇన్చార్జి అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, అసిస్టెంట్ కమాండెంట్ లు సాంబ శివరావు,అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ , హైదరాబాద్**

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలతో ఉదయం ఫ్లాట్ గా ప్రారంభమైన సూచీలు కాసేపు ఒత్తిడికి గురయ్యాయి. ఆ తర్వాత ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి మళ్లాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 226 పాయింట్ల లాభంతో 76,759 వద్ద క్లోజ్ అయింది. నిఫ్టీ 86 పాయింట్లు పెరిగి 23,249 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: భారతి ఎయిర్ టెల్ (2.78%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (2.59%), బజాజ్ ఫైనాన్స్ (1.82%), నెస్లే ఇండియా (1.73%), మహీంద్రా అండ్ మహీంద్రా (1.51%).

టాప్ లూజర్స్: టాటా మోటార్స్ (-7.37%), ఐటీసీ హోటల్స్ (-4.98%), బజాజ్ ఫిన్ సర్వ్ (-2.12%), అదానీ పోర్ట్స్ (-1.86%), జొమాటో (-1.66%).

## సౌత్ ఇండియన్ షార్ట్ స్టోరీ మీట్‌కు పెద్దింటి

**బలగం టీవీ , సిరిసిల్ల**



సాహిత్య అకాడమీ ఎస్సార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చెన్నై వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న దక్షిణ భారత కథా రచయితల సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ఎంపికయ్యారు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ తమిళనాడు కర్ణాటక కేరళ మొదలగు ఐదు రాష్ట్రాల రచయితలు పాల్గొనే ఈ సదస్సు ఫిబ్రవరి 3 తారీఖున చెన్నైలో జరగనుంది. తెలంగాణ మట్టి జీవితాలను ఉద్యమాన్ని కథలుగా మలిచి సాహిత్య లోకానికి పరిచయం చేసిన పెద్దింటి మరొకసారి చెన్నై వేదికగా దక్షిణాది రాష్ట్రాల రచయితల సమ్మేళనంలో తెలంగాణ మట్టి మనుషుల కథను వినిపించనున్నారు. ఇప్పటికే పలు అవార్డులు రివార్డులతో పాటు సినిమాలకు కూడా రచనలు చేస్తున్న పెద్దింటి సిరిసిల్లలో రాజీవ్ నగర్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

# ఫిబ్రవరి 16న చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు..!




**బలగం టీవి, హైదరాబాద్**

పాకిస్థాన్ వేదికగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరుగనున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ జరుగనున్నది. అంతకు ముందు 16న లాహెూర్‌లో చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవం జరుగనున్నట్టు తెలుస్తోంది.ఈ ట్రోఫీ ప్రారంభ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్‌ను పీసీబీ ఆమోదించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. అంతర్జాతీయంగా ఉన్న క్రికెట్ బోర్డుల ప్రతినిధులతో పాటు క్రికెట్ దిగ్గజాలు, సెలబ్రిటీలు, ప్రభుత్వ అధికారులు, టోర్నీలో పాల్గొనే 8 జట్ల సారథులు అతిథులుగా ఈ ఆరంభ వేడుకల్లో పాల్గొననున్నారు. అయితే, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రారంభోత్సవానికి హాజరవుతాడా లేదా తెలియాల్సి ఉంది. సమాచారం మేరకు.. బీసీసీఐ రోహిత్‌ను లాహెూర్‌కు పంపేందుకు అవకాశం లేదని తెలుస్తున్నది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రెస్ కాన్ఫరెన్స్, ఫొటోషూట్ కోసమైనా లాహెూర్‌కు వస్తారా ? లేదా అన్న విషయంలో స్పష్టత లేదు.

ఫిబ్రవరి 19న కరాచీలోని నేషనల్ స్టేడియంలో పాకిస్థాన్ న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ముందు షెడ్యూల్ చేసిన కార్యక్రమాల జాబితాకు చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 7న గడాఫీ స్టేడియాన్ని పీసీబీ పునః ప్రారంభించనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్‌ను, 11న కరాచీలో నేషనల్ స్టేడియం పునః ప్రారంభోత్సవానికి అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని అతిథిగా ఆహ్వానించారు. ఫిబ్రవరి 16న లాహెూర్‌లో జరిగే కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్, ఫొటోషూట్ కోసం పీసీబీ, ఐసీసీ షెడ్యూల్‌ను రూపొందించినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం చారిత్రాత్మక లాహెూర్ కోటలోని హుజురి బాగ్‌లో జరుగుతుంది. బోర్డుల అధికారులు, ప్రముఖులు, క్రీడా దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులను ఆహ్వానించనున్నారు.




## 'తండేల్' సెన్సార్ పూర్తి

**బలగం టీవి, హైదరాబాద్**

అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న మూవీ 'తండేల్' వచ్చే వారం రిలీజ్‌కు రానుంది. ఈ సినిమాను దర్శకుడు చందూ మొండేటి డైరెక్ట్ చేస్తుండగా పూర్తి పీరియాడిక్ నేపథ్యంలో ఓ చక్కటి లవ్ స్టోరీ మూవీగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నది. ఈ సినిమా నుంచి ట్రైలర్ రిలీజ్ కావడంతో ఈ మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ఇక ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమా కథ ప్రేక్షకులను ఖచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. కాగా ఈ చిత్రానికి టైటిల్ కార్డ్స్, యాడ్స్ కలుపుకుని 2 గంటల 32 నిమిషాల నిడివి ఉండబోతున్నట్టు చిత్ర యూనిట్ పేర్కొంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇక ఈ సినిమాను అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## తొలి చిత్రానికి సంతకం చేసిన మోనాలిసా

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో పూసలమ్ముకునే 16 ఏళ్ల అమ్మాయి మోనాలిసా భోస్లే..రాత్రికి రాత్రే సెన్సేషన్‌గా మారిపోయిన విషయం తెలిసిందే. ఆమెకు ఏకంగా బాలీవుడ్ చిత్రంలో నటించే ఆఫర్ వచ్చింది. తాజాగా ఆమె తన తొలి చిత్రానికి సంతకం చేసింది.'ది డైరీ ఆఫ్ మణిపూర్' చిత్రంలో ఆమెకు ఛాన్స్ ఇవ్వనున్నట్లు దర్శకుడు సనోజ్ మిశ్రాఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన స్వయంగా మోనాలిసా ఇంటికి వెళ్లారు. తాను ఆఫర్ చేసిన చిత్రంలో నటించేందుకు ఆమె నుంచి అంగీకార పత్రంలో సంతకం తీసుకున్నారు. ఇక చిత్రీకరణకు ముందు ముంబైలో మోనాలిసాకు యాక్టింగ్ నేర్పించనున్నారు.

కుంభమేళాలో మోనాలిసా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వీరి కుటుంబం తరాలుగా పూసల దండలు అమ్ముకుని జీవనం సాగిస్తోంది. తల్లిదండ్రులకు సాయంగా మోనాలిసా కూడా చిన్నతనం నుంచే పూసల దండలు అమ్ముతున్నది. ఈ క్రమంలోనే మహాకుంభమేళా సందర్భంగా పూసల దండలు అమ్ముకోవడానికి ప్రయాగ్‌రాజ్‌కు వచ్చింది. అక్కడే మోనాలిసా అమాయకపు మొహం, కాటుక దిద్దిన తేనె కాళ్లు చూసి కొంతమందికి ముచ్చటేసింది. దీంతో ఆమె ఫొటోలు, వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో ఆమె గురించి అందరికీ తెలిసింది.



## సినిమా పరిశ్రమలోనే సక్సెస్ రేట్ తక్కువ

**బలగం టీవి, హైదరాబాద్**

తమిళ పరిశ్రమ గత ఏడాది చాలా నష్టపోయిందని అక్కడి ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ క్రమంలో విశాల్ స్పందించాడు. ఇదే మాట తాను గతంలో చెప్పానని అప్పుడు తనని విలన్‌లా చూశారని అన్నాడు. అన్ని పరిశ్రమల్లో కంటే సినిమా పరిశ్రమలోనే సక్సెస్ రేట్ తక్కువగా ఉంటుందని విశాల్ అన్నాడు. డబ్బులు ఎక్కువగా ఉంటే పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలి.. లేదంటే భూమి కొనుక్కోవాలి.. అంతే కానీ డబ్బులున్నాయని సినిమాల్లోకి రాకూడదు.. అన్నారు. అంబానీ, విజ య్ మాల్యా వద్ద కూడా చాలా డబ్బులు ఉంటాయని, కానీ వారు సినిమాలు తీయరని, వారికి ఇందులో లాభాలు రావని తెలుసు కాబట్టే దూరంగా ఉంటారని అన్నాడు. కోలీవుడ్‌లో గత ఏడాది పెద్ద చిత్రాలన్నీ కూడా బోల్తా పడ్డ సంగతి తెలిసిందే. పాన్ ఇండియా చిత్రాలు, క్రేజీ కాంబినేషన్లు అంటూ కోలీవుడ్ కూడా కథను గాలికి వదిలేసింది. ఒకప్పుడు కోలీవుడ్ చిత్రాలకు మంచి బ్రాండ్ ఇమేజ్ ఉండేది. కానీ ఇప్పుడు కోలీవుడ్ చిత్రాల నాణ్యత తగ్గిపోయిందనే టాక్ వస్తోంది.

## నేడు "సంహారం" విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




గతంలో దాసరి, మోహన్ బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ తదితరుల వద్ద వందకు పైగా సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్ గా పనిచేసిన ధర్మ ఇప్పుడు మెగా ఫోన్ పట్టారు. రత్న మేఘన క్రియేషన్స్ పతాకంపై దర్శక, నిర్మాతగా ఆయన తెరకెక్కించిన చిత్రం "సంహారం". ఆదిత్య, కవిత మహతో హీరో హీరోయిన్లుగా నటించారు.ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకుని ఈ నెల 31న(నేడు) విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ హైదరాబాద్ లోని ఫిలిం ఛాంబర్ లో జరిగింది. చిత్రం పాటలను, ప్రోమోస్ ను ప్రదర్శించారు. దీనికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ, "గురువు దాసరి గారి కాం పౌండ్ లో పలు చిత్రాలకు ధర్మ పనిచేయడం వల్ల నాకు పరిచయం ఉంది. చిత్రపరిశ్రమలోని ఆటుపోట్లను సుదీర్ఘ అనుభవంలో అర్థం చేసుకుని, అవహ గాన చేసుకున్న టెక్నీషియన్ ధర్మ ఈ చిత్రం ద్వారా దర్శక, నిర్మాతగా మా రడం అభినందనీయం. పాటలు, ప్రోమోస్ చాలా బావున్నాయి" అన్నారు.

# కోహ్లీ కోసం ఎగబడ్డ ఫ్యాన్స్..

## మైదానం వద్ద తోపులాట.. పలువురికి గాయాలు..!





**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గురువారం ప్రారంభమైన ఆఖరి లీగ్ రంజీ మ్యాచ్‌లో ఢిల్లీ తరపున బరిలోకి దిగాడు. 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. అయితే సౌరాష్ట్రతో ఢిల్లీలో అరుణ్ జైట్లీ మైదానం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించడంతో ఫ్యాన్స్ పోటెత్తారు. ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ప్రవేశం కల్పించడంతో అభిమానులు స్టేడియానికి క్యూ కట్టారు. అయితే గేట్ నంబర్ 16 వద్ద స్వల్ప తోపులాట చోటు చేసుకున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు సమాచారం. సెక్యూరిటీ గార్డ్‌కు కూడా గాయాలైనట్లు తెలిసింది. ఓ పోలీసు బైక్ కూడా ధ్వంసమైంది. ఈ ఘటనతో మైదానం వెలుపల గందరగోళ పరిస్థితి తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. మరోవైపు ఓ అభిమాని కోహ్లీని కలుసుకునేందుకు భద్రతను ఉల్లంఘించి మైదానంలోకి దూసుకెళ్లాడు. అక్కడ కోహ్లీ వద్దకు వెళ్లి పాదాలను తాకాడు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది సదరు వ్యక్తిని అక్కడి నుంచి బయటకు పంపించారు.

### తగ్గని అభిమానం

కోహ్లీ పేలవ ప్రదర్శన కనబరుస్తున్నా.. అతనిపై అభిమానం మాత్రం ఏం తగ్గలేదని ఈ మ్యాచ్ ద్వారా నిరూపితమైంది. భారీ సంఖ్యలో అభిమానులు హాజరవ్వడంతో అరుణ్ జైట్లీ స్టేడియం బయట క్యూ లైన్ రెండు కిలోమీటర్ల మేర ధాటింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

ఇక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు 241 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఒక్క వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది.

# విచిత్ర రనౌట్

**బలగం టీవి, హైదరాబాద్**



క్రికెట్ చరిత్రలోనే ఓ బ్యాటర్ విచిత్రమైన విధంగా రనౌట్ అయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇంగ్లాండ్- సౌతాఫ్రికా అండర్- 19 జట్లు అనధికార టెస్టు మ్యాచ్‌లో తలపడ్డాయి. మ్యాచ్ రెండో ఇన్నింగ్స్ 30.4 ఓవర్ వద్ద ఇంగ్లాండ్ బ్యాటర్ ఆర్యన్ సావంత్ క్రీజ్‌లో ఉన్నాడు. అతడు సౌతాఫ్రికా బౌలర్ జాన్ రోల్స్ వేసిన బంతిని స్వీప్ షాట్ ఆడాడు. అయితే షార్ట్ లెగ్‌లో ఉన్న ఫీల్డర్ జోరిచ్ వాన్ హెల్మెట్‌ను తాకిన బంతి మళ్లీ స్టంప్స్ వైపునకు రిటర్న్ వచ్చి, బెయిల్స్‌ను పడగొట్టింది. అప్పటికే షాట్ ఆడిన సావంత్ క్రీజ్ బయట ఉన్నాడు. బంతి బెయిల్స్‌ను పడగొట్టడం వల్ల సౌతాఫ్రికా జట్టు రనౌట్‌కు అప్పీల్ చేసింది. బంతి తొలుత హెల్మెట్‌ను తాకిందని అంతా భావించినా, రిప్లేలో మాత్రం ఫీల్డర్ మోకాలిని బలంగా తాకినట్లు కనిపించింది. దీంతో సావంత్‌ను రనౌట్‌గా ప్రకటించారు. మరోవైపు, బ్యాటర్ సావంత్ మాత్రం షాక్‌కు గురైనట్లు అలాగే కాసేపు క్రీజ్‌లో ఉండిపోయాడు. ఇక బంతి బలంగా తాకడం వల్ల వాన్ బాధతో అక్కడే కింద పడిపోయాడు. వెంటనే జట్టు సహచరులు వచ్చి అతడికి ఫిజియో చేశారు.

## నేడే సెమీస్

**బలగం టీవి, హైదరాబాద్**




మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌లో భాగంగా టీమిండియా ఇంగ్లాండ్‌తో జనవరి 31న తలపడనున్నది. ఐసీసీ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీ ఫైనల్ వరకు చేరింది.గ్రూప్ దశలో వెస్టిండిస్, మలేషియా, శ్రీలంకపై వరుస విజయాలను నమోదు చేసి సూపర్ సిక్స్‌కు చేరింది. సూపర్ సిక్స్ దశలో తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టుపై 150 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది.